

# ఆదర్శ గృహిణి

వి. వి. యస్. రామదాసు

ఆఫీసులోనే ఎక్కువ కాలం గడిపేస్తాననీ చాలా కష్టపడి పనిచేస్తాననీ అందరూ అనుకుంటారు. కాని అట్లా నేను పని చేయడానికి నా నిజాయతీకంటే నా ఇంటి పరిస్థితే ఎక్కువ కారణమని చాలమందికి తెలియదు.

మా యింట్లో శాంతి లేదు. నా భార్య ఎప్పుడూ సాధించుకుతింటుంది. ఆవిడకు లోపం ఏమిటా అంటే ఏమీ కనపడదు నా కంటికి. ఆవిడకు అత్త పోరుగాని, మామ పోరుగాని లేదు. ఎందుచేతనంటే ఆవిడ అదృష్టవశాత్తు ఆమె మా యింట్లో అడుగుపెట్టిన తరువాత రెండేళ్ళు తిరుగకుండానే నా తల్లిదండ్రులు పోయారు. ఆమెను సుఖపెట్టాలనీ ఆమెకు కావలసినవి సమకూర్చాలనీ నేను శాయశక్తులా ప్రయత్నిస్తున్నాను. కాని ఆమె తృప్తిపడదు.

మేము మా దాంపత్యజీవితంలో చాలా విషయాలనుగురించి వాదించుకుంటాం. నేను చెప్పినది ఆమెకు నచ్చదు. ఆమె చెప్పినది నాకు నచ్చదు. నాకంటె అందమైన వాళ్ళను, ఎక్కువ డబ్బు గల వాళ్ళను నాముందు పొగుడుతుంది.



నాకు వళ్ళు మండుతుంది. అయినా ఆమెతో వాదించలేక విసుగెత్తి ఊరుకుంటున్నాను.

ఏవిషయంలోనైనా సరే నన్ను ఈసడించకుండా, నామీదే తప్పు వేయకుండా ఉండలేదు.

మేము ప్రేమించుకుని పెండ్లాడలేదు. ఏదో, పెద్దవాళ్లు కుదిర్చి చేశారు. నాకు ప్రేమంటే అనుభవంలోకి రాలేదు. పెళ్ళయాక అదే వస్తుందని ఊరుకున్నాను.

నేను ప్రేమించడానికే ప్రయత్నిస్తున్నాను. కాని ఆమె పడనివ్వటంలేదు. మేము ఎంత పోట్లాడుకున్నప్పటికీ, వరుస తప్పకుండా పై ఆఫీసుకి వెళ్ళే సాంవత్సరిక నివేదికలకు మల్లే ఏడాదికో కాన్పు తయారవుతోంది. మా జీవితం సాధింపులతో, పిల్లల గొడవతో కీచులాటలతో వృధా అయిపోతోంది.

పై అధికారి కూడ అప్పుడప్పుడు సాధిస్తాడు కాని ఒక భార్య సాధింపులకీ ఆఫీసరు సాధింపులకీ తేడా ఏమిటంటే ఆఫీసరుతో మనం రాత్రంతా గడపనవసరంలేదు.

పిల్లలు పుట్టడంతో చాలమంది భార్యలకు క్రొత్తక్రొత్త అధికారాలు సంక్రమిస్తాయి కాబోలు!

ఆమె గయ్యాళి అని సరిగ్గా చెప్పలేను. కారణం ఆమె నా భార్య అనే కావచ్చు. అయితే గయ్యాళితనానికి ఆమె మూడు నాలుగు మెట్లు దిగువనుంటుందేమో.

'ఇంటికన్న గుడి పదిలం' అన్నట్లు ఆఫీసులోనే కాలం ఎక్కువగా గడపటం అలవాటవుతోంది.

అటువంటి రోజులలో ఒకనాటి సాయంత్రం అయిదున్నరగంట లయినప్పటికీ నేను ఫైల్సు తిరగవేస్తూ కూర్చున్నాను.

"ఇంకా పనేమిటి మూర్తిగారూ" అంటూ శర్మగారు నా ప్రక్క కుర్చీలో కూర్చున్నారు.

"ఎంత చేసినా తెమలదండీ, శర్మగారూ" అన్నాను ఫైల్సు తిరుగవేస్తూనే.

"ఇవాళ్టికి కట్టిపెట్టి అట్లా బీచికేసి వెళదాం రాండి" అని బలవంతంచేశాడు.

"సరే" నని బయలుదేరాను.

"అయితే మూర్తిగారూ, ఏదైనా ఇల్లు చూసిపెట్టండి బాబూ. ఎన్నాళ్ళీ ఆఫీసులో మకాం వెయ్యటం, హోటలు భోజనం చేస్తూ?"

"ఇది విశాఖపట్టణమండి శర్మగారూ. ఇళ్ళు అంత తేలికగా దొరుకుతాయా మరి? మీరు వచ్చి ఒక వారం రోజులే అయింది. నాలుగు నెలల క్రితం వచ్చిన శాస్త్రిగారు టర్నర్సు సత్రంలో ఒక గదిలో కాలక్షేపంచేస్తున్నారు.''

తరువాత బీచికి వెళ్ళి కూర్చునే

వరకూ మా సంభాషణ అద్దెఇళ్ళు, వాటిని కుదుర్చుకోవడంలోని యిబ్బందులు ఒక్కొక్క ఊర్లో ఎట్లా ఉంటాయో ముచ్చటించుకోవటంలో సాగిపోయింది.

"మీరు ఎట్లాగయినా ఒక చిన్నవాటా అయినాసరే చూసిపెట్టాలండి మూర్తిగారూ. ఎందుచేతనంటే నా భార్య నన్ను విడిచి ఒకక్షణం కూడా ఉండలేదు."

"అట్లాగా ?" అన్నాను నా భార్య గురించి ఆలోచిస్తూ.

"మీరు నా ఆప్తులని భావించి చెబుతున్నాను సుమండీ. ఆమెకు నామీద చాలప్రేమ."

"మీరు గొప్ప అదృష్టవంతులు శర్మగారూ !"

"నేను కూడా ఆమెను ప్రేమిస్తున్నాను."

"ఎంత అదృష్టం !" అన్నాను ఈర్ష్యను కప్పిపుచ్చిన ఆశ్చర్యంతో.

"అంతేనామరి ! మేం అసలు ఒకరినొకరు ప్రేమించుకొనే పెళ్ళాడాం."

"చెప్పరేం ?" అన్నాను ఉత్సాహంగా.

"విశేషమేమిటంటే, పెళ్లాయాకకూడా మేమింకా ప్రేమించుకుంటున్నాం."

"అపూర్వం !"

"ఆమె చాలా అందమైనది. ఒక్క 'అందమైనది' అన్న ముక్క ఆమె అందాన్ని వర్ణించడానికి చాలదు. మరేదైనా క్రొత్తమాట సృష్టించాలి ఆమె సౌదర్యాన్ని వర్ణించడానికి."

"సినీమా స్టార్లంత అందముగా ఉంటారాండి ?" అని అడిగాను సంకోచిస్తూ.

"ఆమె గోటికి కూడా పోలరు ఆ సినీస్టార్లు. కాగా ఆమె శీలం వాళ్ళకెక్కడిది ?"

"అవునవును.''

"ఇక ఆమెపాటని లతామంగేష్కరు పాటతోనే పోల్చాలి."

"అందుకే కాబోలు మీరు రేడియో కొనదలుచుకో లేదన్నారు మొన్న'' అందామనుకుని అందులో సగం వరకే అన్నాను.

''ఆమెవంట అమృతతుల్యం" అన్నాడు శర్మ నామాటలు పూర్తికానివ్వకుండానే.

"కాబట్టే హోటలుభోజనం మరీ విషతుల్యంగా ఉంటుంది మీకు."

"ఆమె..." అని కెరటాలకేసి చూస్తూ ఆలోచిస్తున్నాడు శర్మ.

"అయితే శర్మగారూ, మీ రిద్దరూ ఎప్పుడూ దెబ్బలాడుకోలేదూ ?" అన్నాను.

"ఆఁ అదే చెప్పబోతున్నాను. ఆమె ఎంత మృదువుగాను, మధురంగాను మాట్లాడుతుందంటే ఆమె చెప్పింది కాదనలేనంటే నమ్మండి.''

"మరి మీకు వివాదాంశాలు లేవా ?''

"ఉంటాయి. కాని ఆమె నేను చెప్పిందానికి ఒప్పుకొనకపోతే నేను ఆమె చెప్పిందానికి ఒప్పుకొనేట్టు చెబుతుంది. ఇప్పటివరకు ఒప్పుకుంటూనే ఉన్నాను."

ఈ పరిపూర్ణత చెందిన ఆదర్శ వైవాహిక జీవనం గూర్చి వింటూఉంటే నాలోని ఈర్ష్య రెచ్చిపోతోంది. శర్మ చెప్పిన సంగతులు నమ్మలేకపోతున్నాను. వీళ్ళకి డబ్బు ఇబ్బందులు లేవా ?

ధైర్యంచేసి అడిగాను. ''శర్మగారూ, మీరేమీ అనుకోకండి ఇట్లా అడుగుతున్నానని. మీకు ఆర్థికంగా ఒత్తిడి వచ్చినప్పుడు జగడమాడుకోవటంలేదా ?"

అతడు ఒక నవ్వు నవ్వి, "ఓ, అదా మీ సందేహం? వినండి. ఆమె సంగీతం ట్యూషన్లు చెప్పి ఇంచుమించు నా జీతం అంత సంపాదిస్తుంది. ఆమె నన్ను ఒక అణాకూడ అడుగదు." అన్నాడు.

''అలాగా శర్మగారూ ?''

"అవునండి. ఇంకా వినండి. ఆమె ఇంటిపనులన్నీ ఎంతో చక్కగా చేస్తుంది."

"ఆవిడకు ఎంబ్రాయిడరీ వచ్చునా ?"

"అందులో ఆమె అందెవేసిన చెయ్యి. చుట్టుప్రక్కల ఉన్న ఆడవాళ్ళంతా ఆమె దగ్గర నేర్చుకోడానికి వస్తారు.''

"పొరుగువాళ్ళతోకూడ పోట్లాటలు లేవాండి మీ ఆవిడకు ?''

''మీరు నమ్మండి నమ్మకపోండి. ఇంతవరకు ఒకరితోనైనా దెబ్బలాడలేదు."

"చాల గొప్ప విషయమే.''

''మా గదిని ఎంతో ఆర్టిస్టిక్ గా అలంకరిస్తుంది.''

"నిజంగా మీ ఇల్లు స్వర్గం అన్న మాట !''

"సందేహ మేముందీ ? నా బట్టలు యావత్తూ ఆవిడ చేతిమీదుగానే కుట్టబడతాయి. అన్నట్లు చెప్ప మరచాను. మా యింట్లో సింగరు కుట్టు మెషీను ఉన్నది."

"మీకు కుట్టుకూలి మిగులు అన్న మాట. బాగానే ఉంది.''

''అంతేనా మరి, మేము చాకలివాడిని పెట్టుకోలేదు. అన్ని బట్టలూ ఆవిడే ఉతికి ఇస్త్రీ చేస్తుంది.''

"ఎంత పొదుపరితనం !"

"చాకలి బట్టలు చింపేస్తాడు. ఎరువు ఇస్తాడు. వాడి కెందుకు వెయ్యాలి అంటుంది నా భార్య.''

"నిజమే మరి.''


''ఇంత చాకిరీ చేసినా తన సౌందర్యాన్ని మల్లెపువ్వు కుమల్లే కాపాడుకుంటూ రాత్రి నా వద్దకు వచ్చేటప్పటికి 'ఏమిటి ! ఇప్పుడే స్వర్గంనుంచి దిగినదా' అనిపిస్తుంది."

ఇంకా అయన చాలా సేపు మాట్లాడాలి అనుకున్నాడేమో గాని నేను

వదిలించుకునే ధోరణిలో "ఇక లేద్దామా ఎనిమిదయింది" అన్నాను.

"ఇంకా మీతో చెప్పవలసినవి చాలా ఉన్నాయి. రేపు చెప్పుకుందాం" అని లేచాడు.

ఆయన హోటలువైపు, నేను ఇంటివైపు దారితీశాము. ఆయన చెప్పిన భార్యకు నా భార్యకు ఎంత తేడావుంది — మా ఆఫీసరు కోటుకు నా కోటుకు ఉన్నంత తేడా ఉంది! ఆయనచెప్పిన విషయాలు తలచుకొంటూ రీడింగురూము సందు వరకు వచ్చాను.



"ఏమండోయ్ మూర్తిగారు, ఎక్కడ నుంచి రాక ?" అంటూ శాస్త్రి పలుకరించాడు.

"బీచినుంచండి శాస్త్రిగారు. శర్మగారు బలవంతంచేసి లాక్కుపోయారు. సరే గాని శాస్త్రిగారూ, మీరూ శర్మగారూ ధవళేశ్వరంలో ఒకే ఆఫీసులో పనిచేసేవారు కదండీ ?"

"అవునండీ. ఏం ? ఆయన భార్య సుగుణాలజాబితా మీకుకూడాఅంటగట్టాడా యేమిటి శర్మ'' అని శాస్త్రి నవ్వాడు.

"అవును. ఆ భోగట్టా మీకు కూడా తెలుసునా ఏమిటి ?''

"ఆఁ ! ధవళేశ్వరంలో ఉన్నన్నాళ్లూ వినలేక విసుగెత్తిపోయింది. ఈ ఊరు నన్ను బదిలీచేసినప్పుడు నేను సంతోషించినదల్లా ఆయనగోల తప్పినందుకే. కాని నా కర్మకాలి ఇక్కడకూడా దాపురించాడు.''

"అందుకే కాబోలు హోటలు మారుస్తానని నిన్న చెప్పారు ?"

"మరేఁ ! బాగా కనిపెట్టారు ?''

''ఇంతకీ ఆయన చెప్పినవి సత్యానికి దూరమైన సంగతులా ?"

"సానుభూతితో అతని విషయం ఆలోచిస్తే జాలివేస్తుంది. నిజంఅన్నదాని నిర్వచనం వరకూ పోవలసివస్తుంది. అసలుసంగతేమిటంటే..." అని ఆగి వస్తూపోతూవున్న జనసమూహం వెనకాతల దూరంగా సూస్తున్నాడు.

శర్మ భార్యగురించి ఏదో అసహ్యకరమైన రహస్యం ఉండి ఉండాలి. అది ఏమై ఉంటుంది ? ఆమె అందవికారమైనదా ? ఆమెకంఠం వినసొంపుగా ఉండదా ? లేక నా భార్యవలె సాధించుకుతింటుందా ? అదీకాకపోతే ఆమె అతన్ని మోసగించి తిరుగుతోందా ? ఈ విషయాలు తెలుసుకోవడానికి నా మనస్సు చాలా ఆతృతపడుతోంది.

"కొంచెం కాఫీ తీసుకుందాం రండి శాస్త్రిగారూ"అనిప్రక్కనేఉన్న 'మిలాప్' హోటలులోకి తీసుకుపోయాను.

"రెండు కప్పులకాఫీ'' అని వెయిటరుతోచెప్పి శాస్త్రివైపు తిరిగి ''అయితే శాస్త్రిగారూ, శర్మా అతని భార్యా ఒకరినొకరు ప్రేమించుకొనే పెళ్ళిచేసుకున్నారటగా ?" అన్నాను.

''అది పూర్తిగా నిజంకాదు."

"అంటే ?''

"శర్మ రాజమండ్రి కాలేజీలో చదువుతున్నప్పటినుంచీ ప్రేమించి పెళ్ళిచేసుకోవాలనే వాదంలోనివాడు."

"ఇంతకూ అతని భార్య అతనిని ప్రేమించలేదంటారా ?''

"వినవయ్యా బాబూ. అతడు కాలేజీ రోజుల్లో ఇద్దరు ముగ్గురు కాలేజీయువతులను ప్రేమించాడు.''



''ఇదిగో, నీకెన్నిసార్లు చెప్పాను, నన్ను తీయవద్దని! నీఫ్రెండ్ ఎందుకు దిగలేదు!"

"ఆఁహా ?''

"కాని అందులో ఒకరైనా అతన్ని ప్రేమించలేదు.''

"అమ్మయ్య'' అని ఒక నిట్టూర్పు విడిచాను.

"అందుచేత మిగతా సమస్యలు రాలేదు.''

ఇంతలో కాఫీవచ్చింది. కాఫీత్రాగి మూతి తుడుచుకుంటూ శాస్త్రిగారన్నారిట్లా, "కాని అతడు నిడదవోలులో ఉద్యోగంచేస్తూ ఉండగా ఒక బడిపంతులమ్మ శర్మను చూచి ప్రేమించింది.''

"అయితే ఆమెను శర్మ ప్రేమించాడా ?"

"ఏమైనా, అతడు అంగీకరించాడు."

"బహుశా ఎందుచేతనంటే తనను ఎవరో ఒక స్త్రీ ప్రేమిస్తున్నదికదా అని తెలిసి ఒకవిధమైన తృప్తితో అంగీకరించి ఉంటాడు.'' అన్నాను.

''ఎట్లాగైతేనేం ? వారి వివాహం జరిగింది."

''ఆమె చాలా అందముగా ఉంటుందట ?''

''ఏదో ఒకమాదిరిగా ఉంటుందేమో.

అయితే ఆమెను మనం అతని కళ్ళతో చూడవలసి ఉంటుంది.''

''ఆమె చాల శ్రావ్యంగా పాడుతుం దట? లతామంగేష్కర్‌తో సమానమట."

"ఆమె సుమారుగా పాడుతుంది. అయితే ఆమె లతామంగేష్కరుతో సమానం అన్న విషయం అతని చెవులను ఎరువు తెచ్చుకు వింటే రూఢీ అవుతుంది.''

అయినప్పటికీ ఇంతవరకు జరిగిన భోగట్టాను బట్టి శర్మ గర్వింపదగ్గ భార్యనే పెళ్ళి చేసుకున్నాడని అసూయ పడుతున్నాను.

''ఒకటిమట్టుకు నిజం. అతడు చెప్పే ఆమె గుణాలు అంత తీవ్రతలో ఉన్నా లేకపోయినా ఆదర్శ దంపతులమని వారు మురిసిపోయేవారు" అన్నాడు శాస్త్రి.

"వారు మురిసిపోతే మురిసిపోయారు గాని, ఆయన మనల్ని ఆ సంగతులన్నీ చెప్పి చంపడం దేనికి చెప్పండి?'' అన్నాను.

''మీరు ఒకసారికే ఇట్లా అంటున్నారు. నాకు ధవళేశ్వరంలో రోజూ ఇదే గొడవ.''

"అట్లాగా, పాపం.''

"అతని మనస్తత్వం నాకు అర్థం కావడంలేదు. అతడు త్రాగుబోతు అని చాలమంది అంటారు.''

''ఏం? ఎందుకు త్రాగుబోతు అయ్యాడు? అతని భార్య శీలం మంచిది కాదా?''

''శీలం సంగతి కాదు మూర్తిగారూ! ఆమె చాల మంచిదే. అతన్ని సానుభూతితో అర్థం చేసుకోవాలంటే ఒకేఒక యదార్థాన్ని గుర్తించుకోవాలి'' అని కొంతసేపు ఆగాడు.

"ఏమిటది?'' అని ఆత్రంగా అడిగాను.

"వారు సంతోషంగా కాపురం చేసినది ఆరు మాసములు మాత్రమే. తరువాత నిడదవోలులో కలరా వ్యాధి వల్ల అతని భార్య మరణించింది!'' అన్నారు శాస్త్రిగారు.

